# డిప్లొమేట్

శంకరమంచి పార్ధసారథి

సీతాపతి నోట్లని పైపు సెగలు కక్కుతోంది.

ఎయిరఎకండిషన్డ్ రూమ్ – గదంతా పరిచిన ఖరీదైన మెత్తని తివాసీ, ఖరీదైన ఫర్నిచర్ – అది అతడి ఆఫీసుగది.

అతడు వేసుకున్న ప్యాంటుచొక్కా , కోటు చివరికి ధరించిన నెక టై దానికున్న పిన్ను గూడా ఫారన్‌వే.

సీతాపతికి డబ్బుమీద, ధనికవ్యవస్ధ మీద అంతులేని నమ్మకం, మోజు ధానర్జనకై మనిషి ఎంతకు దిగజారినా తప్పులేదన్నిది అతడు నమ్మిన సిద్ధాంతం. అసలు ఫాలసీస్, ప్రిన్స్‌పుల్సు అన్నవి కేవలం బూటకమని అవి మనిషి తన అసమర్ధతని కప్పి పుచ్చుకోటానికి వుపయోగించే సాధనాలని అతడి విశ్వాసం. మనిషి ఎంతటి చైతన్యవంతుడో, అతడిలోని ఆలోచనలా, భావాలూ అంతటి చంచలమైనవి. అవి క్షణానికి మారిపోతూ వుంటాయి. ఎప్పుడో అన్న మాటకోసం, ఎవరికో చేసిన వాగ్దానంకోసం, నిలబడి పోరాడి, అందుకోసం జీవితాన్ని నాశనం చేసుకోవటంలో అర్ధంలేదు– జస్ట్ నాన్ సెన్స్ – అలాటివారు ఫూల్స్

ఆరోజు అతడి పుట్టినరోజు. అందుకే తన ముప్పై అయిదు సంవత్సరాలలో సాధించిన ప్రగతిని సింహావలోకనం చేసుకుంటున్నాడు.

అయిదు సంవత్సరాల క్రితం వరకు తను చాలా దారుణమైన జీవితాన్ని గడిపాడు. కొద్దిపాటి సంపాదన, తలకు మించిన భాధ్యతలు, దారి ద్రపు చీకటిలో కొట్టుకులాడి పోయాడు. ఆకలి రుచి చూశాడు . నిరాశ, నిస్ప్రుహలతో స్నేహం చేశాడు. ఆలోచించుకుంటే తనకే చాలా ఆశ్చర్యం అనిపిస్తుంది. ఇదే కంపెనీలో తను స్టెనోగా పన్చేసేవాడు. ఆ కంపెనీకేతాను యజమాని నౌతానని ఎప్పుడూ అనుకోలేదు. కారణం జస్ట్ సింపుల్ – వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు.ఆ కంపెనీ యజమాని విశ్వనాధంగారికి తాను పర్సనల్ స్టెనోగా ప్రవేశించడంతో తన జీవితంలో

నూత నాధ్యాయం ప్రారరంభమైంది. ఆయనతో పాటూ తనూ తరచు వాళ్ళింటి కెళ్ళటంతో ఆయనకున్న ప్రాబ్లమ్ అర్థం అయింది.

ఆయన కో కూతురు– పేరు అరుణ. నిగనిగలాడే నల్లని రంగు, మొహంమీద స్ఫోటకం మచ్చలు, ఎడంకంట్లో అందమైన పువ్వు – శ్రీమంతురాలు గనక ఎటూ కదలలేని శరీరం, ఆమెకి వివాహం కావటంలేదు.

దరిద్రపు బ్రతుకు, ఎదుగూబొదుగూ లేని జీతం, జీవితంతో విసిగిపోయిన నాకు డబ్బు కావాలి, హెూదా కావాలి, అధికారం కావాలి.

విశ్వనాథంగార్కి పుత్రికాభరంతో పాటు, కంపెనీ వ్యవహారాలు చూసుకునే అల్లుడు కావాలి. నాక్కావల్సినవన్నీ ఆయనవద్ద వున్నాయి. ఆయనక్కావాల్సింది తను అల్లుడు కావటం. ఓ అమావాస్యనాడు ఇద్దరం చేతులు కల్సుకున్నాం. దట్సాల్. అంతమాత్రం చేత కల్యాణజ అన్నట్లుగా తను నీతి, జాతిలేనివాడినా ? జీవితపు విలువలు తెలియనివాడిపా ? డబ్బు మనిషినా ? నో ! నే నొప్పుకోను. నిజమే ! తను కల్యాణిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకుంటానని ప్రమాణం చేసాడు. వయసు పెట్టిన తొందరలో, వేడిలో ఒకరోజు తొందరపడ్డమాటకూడా వస్తవమే ? అంతమాత్రం చేత తను కలిసొచ్చే అదృష్టాన్ని కాలదన్ని ఆ స్కూలు టీచరు కూతురు కల్యాణిని పెళ్ళి చేసుకుని అసలే నరకప్రాయమైన జీవితాన్ని ఇంకా చీకటి చేసుకోవాలా ? నథింగ్ డూయింగ్.

అంతే ! తన వివాహం అరుణతో జరిగిపోయింది. విశ్వనాధం ఆస్తి, హెూదా, కంపెనీ అన్నీ తన హస్తగతం అయినాయి. అక్కడితో తన జీవిత స్వరూపమే మారిపోయింది. ఇపుడు తను సంఘంలో ఎంతో పరపతిగల వ్యక్తి. ధనికవర్గపు రంగుల ప్రపంచంలో తనూ ఓ మణిదీపం. తాను ఫోను చేస్తే చాలు ఎంతటి పనైనా అయిపోవాల్సిందే ! ఇపుడు తను ఎన్నో వందల మందికి యజమాని. విచిత్రం ఏమిటంటే , చివరికి కల్యాణి భర్త కూడా తన చేతిక్రింద పనిచేస్తున్నాడు.

ప్రక్కనున్న కాలింగ్‌బెల్ నొక్కగానే, ఫుల్ యూనిఫారమ్‌లో వున్న నౌకరొచ్చి ఎయిర్ ఇండియావారి బొమ్మలాగా వినయంగా, భయంగా నిలబడ్డాడు.

“ టీ తీసుకురా ” హుకుం జారీచేశాడు హుందాగా.

వీళ్ళందరికీ తనంటే హడల్,

కల్యాణి భర్త రాజుకి ఉద్యోగం ఇయ్యటానికి ముందు అతడెవరో తనకి తెలీదు. తర్వాత తెల్సింది. అతడు కళ్యాణి, తన మాజీప్రియురాలు భర్తని ఓరోజు తమ మ్యారేజీనాడు చిన్నపార్టీ ఏర్పాటు చేసి, తనని, అరుణని ఆహ్వానించినపుడు గాని తెలియలేదు అతడు కళ్యాణి భర్తని.

అపుడు కల్యాణి తనవంక చూసిన చూపులు  ఇంకా మర్చిపోలేదు, అరుణ వంక తనవంక  మార్చి మార్చి చూడటం, ఆ చూపుల్లో  నిర్లక్ష్యం, అసహ్యం స్పష్టంగా కనిపించాయి.

ఒకసారి  ఆమె అన్నమాటలు ‘ నీకు జీవితపు విలువలు తెలీవు. నువువ జీవితంలో ముందుకు పోవటంలేదు.  క్రిందకి  దిగజారిపోతున్నావ్ ’ ఇంకా భద్రంగా  కళ్ళలోనే దాచుకున్నట్లుగా వున్నాయి  ఆమె చూపులు.

రాజుకి  ఇవన్నీ  తెలీవులావుంది.  అతడు  మామూలుగా వున్నాడు.

కల్యాణిని  ఇంకా డబ్బంటే  ఏమిటో  ఏమిటో తెలీదు. పిచ్చిది. దానితో  చెయ్యలేనివ కొనలేనివి ఏమీ  లేవని ఆమెకి  తెలీదు.  అది ఆమెకి ఋజుచేసి చూపాలి.

ఈలోగా నౌకరు “ టీ ” తీసుకొచ్చాడు.  టీ త్రాగుతుండగా  ఫోను గణగణ మ్రోగింది.

అవతల భార్య అరుణ మాట్లాడుతోంది.

“ ఏమిటండి ఇవ్వాళ  మీ పుట్టినరోజు కదా కనీసం సినిమాకన్నా  తీసికెళ్ళరా  ? ఎప్పుడు పని, పని ! తీరుబడగా ఇంట్లో వుండరు . మనిద్దరం  కల్సి  బయటికివెళ్ళి ఎన్నాళ్ళయ్యింది ? కనీసం  ఈరోజన్నా సరదాగా వుందాం, త్వరగా రండి ” అంటోంది బ్రతిమాలుతున్న దోరణిలో.

సీతాపతి కళ్ళు  మూసుకున్నాడు.  భార్య సింగారించుకుని అవతల ఫోన్ వద్ద ఎలా వుంటుందో వూహించుకుని త్రాగుతున్న  ‘ టీ ’ని క్రింద పెట్టేశాడు. కడుపులో త్రిప్పినట్లుగా అయింది.

కల్యాణి  చూసిన చూపులు, అన్న మాటలు మళ్ళీ జ్ఞాపకం వచ్చాయి.

“ సారీ డియర్ ఇవ్వాళ అర్జెంటు మీటింగుంది బొంబాయినించి  పార్టనర్స్ వచ్చారు. ఇవాళ చాలా బిజీగా వుంది. రాత్రి ఒంటిగంటదాకా  రాలేను. అయినా నాకుమాత్రం  నీతో బయటికి  వెళ్ళాలని , సరదాగా  గడపాలని వుండదా ? అసలామాటకొస్తే ప్రతి క్షణం నిన్ను చూస్తూ కూర్చోవాలనిపిస్తుంది.  కానీ ఎలా  మీనాన్న  అప్పగించిన  ఈ భాద్యతలన్నీ యెవరు చూస్తారా ?  ఈ ఒక్కసారికి  సినిమాకి  ఒంటరిగా వెళ్ళు నేను సాధ్యమైనంతత్వరగా  పనిముగించుకుని వస్తా ...ఓ.కే ” గడగడా కంఠతా పట్టిన పాఠాన్ని అప్ప చెప్పిన విద్యార్థిలాగా మాట్లాడేసి, మరోమాటకి వ్యవధివ్వకుండా ఫోను పెట్టేశాడు.

తనని పెళ్ళి చేసుకున్నది, అంద చందాలు, మనసు చూసి అనుకుంటోంది పూర్ క్రీచర్ ! జస్ట్ ఫర్మనీ !

ఆలోచిస్తూనే ఇంకో నెంబరు డయిల్ చేసి, మళ్ళీ కుర్చీలో సర్దుకుకూర్చుని, మాట్లాడటం మొదలెట్టాడు. " హల్లో లిల్లీ హౌ ఆర్ యూ ? రాత్రి బాగా నిద్ర పట్టిందా ? బై ది బై, నేను గంటలో బయలుదేరి వస్తున్నా, రెడీగా వుండు రేసెస్‌కెళ్ళి, అక్కడినుంచి పార్టీకెళ్ళి, తర్వాత......

" రాత్రి ఒంటిగంటదాకా కార్యక్రమాన్ని వల్లించి ఫోన్ పెట్టేశాడు.

లిల్లీ చాలా తెలివిగలది. తన చూపు ఆమె మీద పడగానే, తనకి లొంగిపోయింది. ఆమెకెంతో ముట్టచెప్పాడు, చెబుతున్నాడు. అదే తనకి ఆస్థి, హోదా లేకపోతే లిల్లీ తనకి లొందేదా ? ఆమెని లొంగదీసుకోటం అంత సులభమయ్యేదా ? కాదు, కానే కాదు. అంతటి లిల్లీయే లొంగినపుడు ఆఫ్ ట్రాల్ కల్యాణి ఏ పాటి ? అందులో తన చేతి క్రింద పనిచేస్తున్న గుమాస్తా భార్య ! ఈ లోగా రాజు, తలుపు త్రోసుకుని మెల్లిగా లోనికొచ్చి దూరంగా బిడియంగా నిలబడ్డాడు.

అతడేదో పనిమీదొచ్చాడని అతని చూపుల్ని బట్టే చెప్పాడు.

" హలో రాజు కమాన్. కుర్చోండి ! ఏమిటి ఇలా వచ్చారు ? " లేవబోయిన సీతాపతి మళ్ళీ సర్దుకుకూర్చుంటూ అన్నాడు.

" మీతో చిన్న పనుండి వచ్చానండి " నిలబడే నీళ్ళు నములుతూ అన్నాడు.

" చెప్పండి " టైము చూసుకుంటూ అన్నాడు.

" నాకు మూడొందలు అడ్వాన్స్ కావాలండి. నెలకింతని తీర్చుకుంటాను " అతనికేదో పెద్ద అవసరం వచ్చిందని అతడి కంఠంలోని ప్రాధేయత, చూపుల్లోని నిస్సహాయత చెబుతున్నాయి.

అతడి పరిస్థితి చూస్తే సీతాపతికి ఎంతో సంతోషంగా వుంది.

మళ్ళీ ఆలోచనల్లో కళ్యాణి !

" అలాగే , మేనేజర్‌తో చెప్పి తీసుకోండి అన్నాడు ఫోజుగా.

" ఈ రోజు మేనేజరుగారు రాలేదండి " గుర్తుచేసుకున్నట్లుగా అన్నాడు రాజు.

" అయామ్ సారీ ! ఈ రోజే కావాలా ? అంత అవసరమా ? " గుచ్చి గుచ్చి గొప్పగా ప్రశ్నించాడు.

" అవునండి చాలా అవుసరం " సిగ్గు పడుతూ అన్నాడు.

ఆలకిస్తున్న సీతాపతి బుర్రలో ఒక మెరుపులాంటి ఆలోచనొచ్చింది. తను ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న తరుణం. ఎప్పటికైనా ఇటువంటి పరిస్థితి వస్తుందని తనకి తెల్సు ఆ ఘడియ రానే వచ్చింది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

" ఆల్ రైట్ రాజు, నేనిప్పుడు పనిమీద బయటికెడుతున్నా. ఈ రోజుకి మళ్ళీరాను అయినా నువు – చాలా అర్జెంటు అన్నావు గనక, నేను బ్యాంకు లోంచి డ్రా చేసి, నీ కభ్యంతరం లేకపోతే మీ ఇంట్లో ఇచ్చేసి నా పని మీద వెడతాను, ఓకే " అంటూ లేచి నిలబడ్డాడు.

సీతాపతి ఖరీదైన బుర్రలో వున్న నీచమైన ఆలోచన అర్ధంకాక " థాంక్సు సారీ ఫర్ ట్రబుల్ " అన్నాడు వినయంగా.

" నోనో ఇట్సాల్ రైట్ " అంటూ వడివడిగా బయటవున్న కారువైపు వెళ్లాడు.

రాజు అలాగే నిలబడి చూస్తుండిపోయాడు.

కారుని డ్రైవ్ చేస్తున్న సీతాపతి తనలోతానే గర్వంగా నవ్వుకున్నాడు. కళ్యాణీ భర్తచేత ఇలా అడిగించిందా ? తను ఒంటరిగా రావాలని ఆమెకి కూడా వుందా ? నిజమే అయినా ఆశ్చర్యపడనక్కర్లేదు. కారణం, డబ్బు ..... డబ్బు. ఎంతటివారలైనా దానికి దాసోహం అనాల్సిందే ! ఇంకా కాసేపట్లో కల్యాణి " మళ్ళీ తనది " కాబోతోంది నిజానికి బ్యాంక్‌కి వెళ్ళనక్కరలేదు. తన జేబులో ఎప్పుడూ కనీసం వెయ్యిరూపాయలకి తక్కువుండవని పాపం రాజుకి తెలీదు. నమ్మేశాడు. పూర్ ఫెలో.

కారుని రాజు ఇంటికి కాస్త దూరంగా ఆపి దిగి హుందాగా నడచుకుంటూ ఇంటిని సమీపించి మెల్లిగా తలుపు తట్టాడు.

తలుపు తీసిన కల్యాణి వచ్చిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయింది.

" నువ్వా ! " అని మాత్రం అనగల్గింది.

" ఎం ? ఆశ్చర్యంగా వుందా ? " అంటూనే చనువుగా లోనికెళ్ళి ఒక కుర్చీలో కూలబడ్డాడు.

ఆమె అలాగే అసహ్యంగా , నిర్లక్ష్యంగా చూస్తూ నిలబడిపోయింది.

సీతాపతికి రెండు క్షణాలు ఆమెవంక చూసి, జేబులోంచి పర్సుతీసి వందకాగితాలు చేత్తో పట్టుకుని " రాజు డబ్బు కవాలన్నాడు. సమయానికి నా దగ్గిర లేకపోయింది. ఇంటిలో నీకిస్తానని చెప్పాను. " సంజాయిషీ ఇస్తున్నట్టుగా అన్నాడు.

ఇప్పటికీ కల్యాణి ఏం మాట్లాడలేదు. . తలొంచుకుని అలాగే నిలబడింది.

" కల్యాణీ నామీద ఇంకా కోపం తగ్గలేదా మెత్తగా అన్నాడు.

" నాకెందుకు కోపం ? " ఎదురు ప్రశ్నించింది,

" నిన్ను మోసం చేసినందకు "

" బురదలో కాలెయ్యటం నా తప్పు. దానికి బురద ఏ విధంగా బాధ్యురాలు ?"

" కథలు  రాస్తున్నావా ? " హేళనగా  అన్నాడు.

" జీవితాన్ని  చదువుతున్నాను. ఐ నా ఆ డబ్బు ఇలా ఇచ్చి వెళ్ళు " నిర్లక్ష్యంగా అంది.

" ఇంద తీసుకో  " అన్నాడు. అయిదు కాగితాల్ని గాలిలో త్రిప్పుతూ. కల్యాణి ముందుకొచ్చి అందుకోబోయింది. అది అవకాశంగా  తీసుకుని ఆమె చెయ్యి  పట్టి మీదకి లాక్కున్నాడు.

ఇది వూహించని ఆమె బిత్తరపోయింది.

కానీ ఆమె వెంటనే తేరుకోవటం, అతడి నించి విడిపించుకోవటం, అతడి చెంప ఛెళ్ళు మనిపించటం ఒకేసారి జరిగిపోయాయి.

ఈసారి బిత్తరపోవటం సీతాపతి వంతయింది.

" పిచ్చి పిచ్చి వేషాలెయ్యక మర్యాదగా బయటికి నడు " ఆమె కళ్ళు కోపంతో నిప్పుకణికల్లా  వున్నాయి.

సీతాపతి ఆహం దెబ్బతింది. అయినా అతడు పట్టువీడని విక్రమాదిత్యుడిలా కల్యాణీ బాగా ఆలోచించుకో. కలిసొచ్చే  అదృష్టాన్ని కాదనకు. నా మాట విన్నావంటే నీ భర్తకు ప్రమోషనిస్తా . నీకు ఏ లోటూ రాకుండా చూసుకుంటాను. ఆనాడు చేసిన తప్పుని  ఈ విధంగానైనా దిద్దుకునే  అవకాశం  కల్గించు " అంటూ ముందుకు రాబోయాడు.

ఆమె కోపం తారాస్థాయికి  చేరిందని  ఎగిరెగిరి పడుతున్న ఆమె వక్షజాలే చెబుతున్నాయి.

" పిచ్చి పిచ్చి  వాగుడు కట్టి పెట్టి  బయటికి నడు. లేకపోతే అసలు రూపం బయటపెడతాను జాగ్రత్త "...

సీతాపతి  ఖరీదైన నవ్వు నవ్వాడు.

" కల్యాణీ,ఆ మాట  అనాల్సింది నేను.  మనిద్దరికీ  వున్న సంబంధం  రాజుకి తెలిస్తే నీ బ్రతుకు  ఏమౌతుందో  ఆలోచించుకో "

కల్యాణి నీరసంగా, నిర్లక్ష్యంగా  నవ్వి, " నీకా శ్రమ అక్కరలేదు. నేను  మా వివాహం జరిగిన మొదటిరోజు రాత్రి అన్ని విషయాలు చెప్పేసాను. అయినా  నా భర్త పేరుకే కాదు, మానసికంగా, గుణగణాల్లో గూడా రాజే  పిచ్చి వేషాలెయ్యక  బయటికినడు. మళ్ళీ ఇటువంటి  ప్రయత్నంచేశావంటే మర్యాద  దక్కదు, జాగ్రత్త "

ఇంకోమాటకి వ్యవధివ్వకుండా లోపలి గదిలోకెళ్ళి మధ్య తలుపు గడియపెట్టుకుంది.

సీతాపతి మొహం  పాలిపోయింది.  అతడినమ్మకం  వమ్ము, అతడి సొమ్ము నేలపాలయినాయి.

మెల్లిగా వంగి క్రిందపడ్డ అయిదు వందకాగితాల్ని తానే జేబులో కుక్కాడు.

ఆస్థి, హోదా, అంతస్థు అన్నీ లభించినాక, పరాభవం, పరాజయం, అందులో ఒక సామాన్య స్త్రీ చేతిలో పొందటం మొదటిసారి.

అంటే డబ్బు చెయ్యలేని పనులుగూడా వుంటాయా ?

డబ్బు సంపాదించి పెట్టలేని సుఖం కూడా ఉంటుందా ?

మౌనంగా, ఏం చెయ్యాలో తెలీక అలా నిలబడ్డ సీతాపతిముఖంలో తిరిగి ఎరుపురంగు పులుముకుంది.

" కాదు ఈ పరాభవం, పరాజయం వ్యక్తిగతమైంది. దీన్ని ధనానికిగాని, ఆ శక్తికి గానీ ఆపాదించటం తప్పు తన ప్రయత్నంలో ఏదో లోపంవుంది అంతే. అలా తనకు తానే సమాధాన పర్చుకుని, మెల్లిగా బయటకొచ్చి కారులో కూర్చుని స్టార్ట్ చేసాడు.

ఆలోచిస్తూ డ్రైవ్ చేస్తున్న సీతాపతి అప్రయత్నంగా ఇంటివైపు తిప్పాడు. కారు మెల్లిగా , నీరసంగా సీతాపతి బంగళాముందు ఆగింది.

పోర్టికోలో అరుణకారు అలాగేవుంది. అంటే సినిమాకి వెళ్ళలేదన్నమాట. ' పిచ్చిది, తను లేందే ఎక్కడికి పోదు ' అనుకుంటూ అరుణగదిని దాటి తన గదివైపు వెళ్ళిపోయాడు.

కానీ అకస్మాత్తుగా , తన ఆస్తంతా పోయినట్టుగా ఠక్కున ఆగిపోయాడు.

అరుణ గదిలో ఎవ్వరితోనో మెల్లిగా మాట్లాడుతుంది.

" ...... .నీ మాటలో, చేతల్లో చేతుల్లో ఏ మత్తు మహత్తు వున్నాయో గానీ, నీ దగ్గిర వున్నంతసేపు నాకు లోకమే గుర్తుండదు, కాలం ఇట్టే గడిచిపోయినట్లుగా వుంటుంది. ఆ సుఖం, అనుభవం శాశ్వతమైతే ఎంత బాగుండు అనిపిస్తుంది " ఆమె మత్తుగా, ప్రేమగా మాట్లాడుతున్న ధోరణిని బట్టి లోపల ఆమె ఏ పరిస్థితిలో వుంటుందో బయట నిలబడ్డ సీతాపతికి ఇట్టే అర్థం అయిపోయింది. కాకపోతే అంతటి మహత్తు గల్గిన అవతల వ్యక్తి ఎవరు అర్థంకాలేదు.

కొంపతీసి రాజు కాదు గదా !

ఇంతలో గదిలోని అవత వ్యక్తి మెల్లిగా అంటున్నాడు.

" అరుణా ! ఇట్టా ఎన్నాళ్ళోసాగదు. ఏదోనాటికి నీ భర్తకి తెలుస్తుంది. అపుడు ఇద్దరికీ అవస్థలు తప్పవు. నాకు వుద్యోగం పోవటం ఖాయం.

ఆ గొంతు సీతాపతికి పరిచయయమైనదే. డ్రైవర్ జేమ్స్‌ది.

వున్నట్టుండి అరుణ పెద్దగా నవ్వటం మొదలెట్టింది.

ఎందుకో సీతాపతికి అర్థంకాలేదు.

“ జేమ్స్ ఆ భయం  నీకక్కర్లేదు. అతడు నన్ను పెళ్ళి చేసుకోటానకి  కారణం నా ఆస్థి అతను అనుభవిస్తున్న ప్రతి పైసా నాది.  సీతాపతి చాలా తెలివిగలవాడు అతడు దాదాపు  నీ లాంటి వుద్యోగే ! నిన్ను వుద్యోగం లోంచి తీసే అధికారం అతడికి లేదు.  భయపడక ఇలా రా.... ”

సీతాపతికి ఇంక మాటలు వినబడటంలేదు. లోపలినుంచి  గాజుల చప్పుడు, చిరుకేకలు తప్ప ఇంకేం వినబడటం లేదు.

లోపల వాళ్ళు ఏ పరిస్థితిలో  వున్నారో అతనికర్థం అయిపోయింది.

అతడు తలుపులు బ్రద్ధలు కొట్టి లోనున్నవారిని సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తలేదు.

ఆవేశంగా వెళ్ళిపోయి డిప్లోమేట్ విస్కీని గుటగుటా త్రాగెయ్యలేదు.

సినిమాలో హీరోలా  పాటపాడటానికి ఎండిపోయిన చెట్టుకోసం వెతుక్కోలేదు.

తాపీగా హాల్లోకొచ్చి, సోఫాలో  కూర్చుని, పైపుని క్లీన్ చేసుకుని, వెలిగించి , హుందాగా, దర్జాగా నడుచుకుంటూ కారువైపు వెళ్ళాడు.

ఆ క్షణంలో సీతాపతి భార్య శీలం గూర్చిగానీ, డ్రైవరు  అవిధేయత గూర్చిగాని ఆలోచించటం లేదు.

తను పరాభవం పాల్చేసిన కల్యాణని, డబ్బు హెూదా, పరపతి అన్నీ వుపయోగింది, ఎలా లొంగదీసుకోవాలి అని మాత్రమే ఆలోచిస్తున్నాడు.

నొప్పింపక....తానొవ్వక....తప్పించుకు తిరుగువాడు డిప్లోమేట్ సీతాపతి సుమతీ !

ఆ డిప్లొమేట్ని తీసుకుని ఇంపాలా కారు గొప్పగా, దర్జాగా ముందుకుపోయింది.

**------- అయ్యిపోయింది -------**